ఈమాన్ వనరులు

విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి, పటిష్టం చేయడానికి వివిధ వనరులున్నాయి. ఉదాహరణకు జ్ఞానం, ఆచరణ, ఆలోచన వగైరా.

జ్ఞానం :

విశ్వాసి సాధ్యమైనంతగా జ్ఞానాన్ని సముపార్జించుకోవాలి. దీనివల్ల విశ్వాసం వృద్ధి చెందుతుంది. హజ్రత్ ఉమర్ రజి అల్లాహు అన్హ్ ఇలా అన్నారు :

« تَعَلَّمْنَا الإِيمَانَ قَبْلَ أَنْ نَتَعَلَّمَ الْقُرْآنَ ثُمَّ تَعَلَّمْنَا الْقُرْآنَ فَازْدَدْنَا بِهِ إِيمَانًا»

అనువాదం :

"మేం మొదట విశ్వాసాన్ని నేర్చుకున్నాం. ఆ తర్వాత ఎంతగా దివ్యఖుర్ఆన్ జ్ఞానం పొందామో అంతగా విశ్వాసం పెరిగింది. పటిష్టమైంది."

అల్లాహ్ గుణనామాల జ్ఞానం ఎంతగా ఉంటుందో, వాటి గురించి అవగాహన, స్పృహ ఎంతగా పెరుగుతుందో అంతగా విశ్వాసం పెరుగుతుంది. అదేవిధంగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జీవిత చరిత్ర గురించి ఎంతగా జ్ఞానం సంపాదిస్తామో, నైతికత, నడవడి, వ్యవహారశైలి, ధర్మం విషయంలో ఆయన నిరంతర కృషి, ధర్మపోరాటం, ఆరాధనల గురించి ఎంతగా తెలుసుకుంటామో అంతగా మన విశ్వాసంలో వృద్ధికి తోడ్పడుతుంది. అందుకే జ్ఞానసంపన్నులను అల్లాహ్ ప్రశంసించాడు. ఆయన ఇలా అన్నాడు :

﴿ قُلْ هَلْ يَسْتَوِي الَّذِينَ يَعْلَمُونَ وَالَّذِينَ لَا يَعْلَمُونَ ۗ ﴿٩﴾ ﴾ الزمر: ٩

అనువాదం :

"చెప్పండి జ్ఞానం ఉన్నవారు, జ్ఞానం లేని వారు సమానులా?" (అల్ జుమర్: 9)

ఆచరణ :

జ్ఞానం మాదిరిగానే ఆచరణ కూడా విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. అచరణలేమి వల్ల, అవిధేయతల వల్ల విశ్వాసం తగ్గుతుంది. బలహీనమవుతుంది. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ అనుచరులు ఎల్లప్పుడు విశ్వాసాన్ని పటిష్టం చేసుకోడానికి, పెంపొందించుకోడానికి ఆలోచిస్తూ ఉండేవారు. హజ్రత్ ఉమర్ రజిఅల్లాహు అన్హ్ **"రండి**

మన విశ్వాస వృద్ధికి పనిచేద్దాం" అంటుండేవారు. ఆ తర్వాత అల్లాహ్ నామస్మరణ సమావేశాలు ఏర్పాటయ్యేవి. హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ రజిఅల్లాహు అన్హ్ ఎవరో ఒక మిత్రుడిని పట్టుకుని "రా కూర్చుని కాస్త మన విశ్వాసాన్ని తాజా చేసుకుందాం" అనేవారు. ఇది ఆయనకు ఒక అలవాటుగా ఉండేది. ఆ విధంగా అల్లాహ్ స్మరణ సమావేశాలు ఏర్పాటయ్యేవి. ఒక హదీసు ఖుద్సీ ప్రకారం అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

«أَنَا عِنْدَ ظَنِّ عَبْدِي بِي، وَأَنَا مَعَهُ إِذَا ذَكَرَنِي، فَإِنْ ذَكَرَنِي فِي نَفْسِهِ ذَكَرْتُهُ فِي نَفْسِي، وَإِنْ ذَكَرَنِي فِي مَلَإٍ ذَكَرْتُهُ فِي مَلَإٍ خَيْرٍ مِنْهُمْ» (متفق عليه)

అనువాదం :

"దాసుడు నా గురించి ఎలాంటి భావాలు కలిగి ఉంటాడో నేను ఆ విధంగానే అతడితో ఉంటాను. అతను నన్ను స్మరించినప్పుడు నేను అతనితో ఉంటాను. అతను తన హృదయంతో నన్ను స్మరిస్తే నేను కూడా అతడిని గుర్తు చేసుకుంటాను. అతను ప్రజలతో నా గురించి ప్రస్తావించినప్పుడు నేను అతని గురించి ప్రజలకన్నా ఉత్తముల వద్ద ప్రస్తావిస్తాను." (ముత్తఫికున్ అలైహ్)

ఆలోచన:

విశ్వాసాన్ని పెంపొందించే మరో మార్గం అల్లాహ్ సృష్టి గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉండడం. సాధారణంగా ఎవరైనా నిపుణుడైన పనివాడి పనితనం గురించి మన ముందు ఎవరైనా ప్రస్తావిస్తే, ఆ పనితనాన్ని మనం కళ్లారా చూస్తే అతడి నైపుణ్యాన్ని ప్రశంసిస్తాము. ఇది సాధారణంగా జరిగే విషయమే. ఆ నిపుణుడి పనితనం మన ముందుకు ఎంతగా వస్తుందో అంతగా అతడిని మెచ్చుకుంటాము. మనం మరికాస్త ముందుకు వెళ్ళి మనం కూడా ఆ నిపుణుడి మాదిరిగా చేయాలని ప్రయత్నిస్తే అతడి గొప్పదనం మరింత స్పష్టంగా మనకు అర్థమవుతుంది. మనం మనస్ఫూర్తిగా అతడి నైపుణ్యాన్ని అంగీకరిస్తాం. అతడి పనితనంపై మన నమ్మకం మరింత పటిష్టమవుతుంది. ఇదేవిధంగా ఒక విశ్వాసి ఈ విశ్వంలోని నిర్మాణాన్ని చూసి ఆలోచన యోచనల్లో మునిగితే అల్లాహ్ పనితనం, అల్లాహ్ గొప్పదనం, అల్లాహ్ దైవత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుంది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆకాశం నిలబడి ఉంది. సూర్యచంద్రులు పరిభ్రమిస్తున్నారు. రాత్రింబవలు వస్తున్నాయి. వెళుతున్నాయి. సారవంతమైన భూమి సస్యశ్యామలమవుతోంది. ఎత్తయిన పర్వతాలు, ప్రవహించే నదులు, పచ్చగా కళకళలాడే చెట్టుచేమ, అన్నీ ఒక వ్యవస్థలో క్రమం తప్పక కొనసాగుతున్నాయి. అన్నీ తమ పనుల్లో నిమగ్నమై ఉన్నాయి.

www.uzairfalahi.com

ఇవన్నీ చూసి ఆలోచిస్తే మనిషి అల్లాహ్ ఔన్నత్యం, గొప్పదనాల ముందు తలవంచి విధేయుడైపోతాడు. విశ్వం పట్ల ఆలోచనయోచనలు చేయడం విశ్వాసి లక్షణాల్లో ఒకటి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ وَيَتَفَكَّرُونَ فِي خَلْقِ السَّمَاوَاتِ وَالْأَرْضِ ﴿١٩١﴾ ﴾ آل عمران: ١٩١

అనువాదం :

“మరియు ఆకాశాలు, భూమి పుట్టుక గురించి ఆలోచిస్తారు” (ఆలి ఇమ్రాన్: 191)

* * *

www.uzairfalahi.com